“మామ్మా! నువ్వు సినిమాకి రానన్నావు కదా? మరి మేము వెళ్ళొస్తాం. ఇల్లు జాగ్రత్తగా చూసుకో.” పార్థుడి గొంతు విని ఏదో ఆలోచిస్తున్న కామాక్షమ్మ చటుక్కున తల ఎత్తి చూసింది.



పార్థుడు శుభ్రంగా తల దువ్వుకుని, మంచి బట్టలు వేసుకుని కనిపించాడు. వాడి ముఖంలో సినిమాకి వెళుతున్నా నన్న ఉత్సాహం కొట్టొచ్చినట్టు [illegible]ంది.

"మంచిది, నాయనా! జాగ్రత్తగా వెళ్ళి రండి" అంది కామాక్షమ్మ.

పార్థుడు అక్కడి నుంచి వెళ్ళి పోయాడు. కాస్సేపట్లో కామాక్షమ్మ కొడుకు రాఘవ, కోడలు వసంత, మనవడు పార్థుడు ఇల్లు కదిలారు. వాళ్ళని సాగనంపి వీధి తలుపు జాగ్రత్తగా వేసి లోపలికి వచ్చింది కామాక్షమ్మ.

హాలులో ఓ మూలగా గోడమీద ఉమాకాంతరావుగారి ఛాయా చిత్రం ఉంది. కామాక్షమ్మ నెమ్మదిగా నడిచి వెళ్ళి ఆ చిత్రం ముందు నిలబడింది. చేతితో మెల్లగా దానిని తడిమింది. తరవాత దానిమీద ఉన్న ఎండిపోయిన పూలదండని తీసివేసింది. "పార్థుడికి మీ రంటే ఎంత ప్రేమనుకున్నారూ! వెర్రి నాగన్న—బడి నుంచి వచ్చేటప్పుడు బొగడ పూలు ఏరుకొచ్చి, 'మామ్మా! తాత ఫొటోకి వేద్దాం' అంటాడు" అంది. మరి కొద్ది క్షణాలు ఆవిడ అక్కడే నిలబడింది. ఓసారి బరువుగా నిట్టూర్చి, 'మీ కేం? మహారాజులా వెళ్ళిపోయారు' అనుకుంది.

ఆ తరవాత హాలులో ఉన్న రేడియో వద్దకు నడిచింది. అయిదు నిమిషాల పాటు రేడియోతో ఎంత కుస్తీ పట్టినా, అందులో నుంచి ఏ విధమైన శబ్దం రాలేదు. 'విరిగి కాళిద [illegible] రేడియో' అనుకుంటూ వెళ్ళి కుర్చీలో కూర్చుని ఏదో పత్రిక తిరగ వేయ సాగింది.

వీధి తలుపు వద్ద ఎవరిదో అలికిడి వినిపించి కామాక్షమ్మ లేచి నిలబడింది. బయట నుంచి—"పిన్నిగారూ!" అన్న పిలుపు గుర్తించి, ఆవిడ త్వరగా వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా శంకరం, లక్ష్మణరావు నిలబడి ఉన్నారు.

"లోపలికి రండి, నాయనా!" అంది కామాక్షమ్మ.

శంకరం, లక్ష్మణరావు లోపలికి వచ్చి కూర్చున్నారు.

"ఏమిటి! ఏదో విశేషం కనిపిస్తోందే?" అంది కామాక్షమ్మ, లక్ష్మణరావు చేతిలో ఉన్న, పసుపు రాయబడిన పత్రికలను చూస్తూ.

"అవునండి, పిన్నిగారూ! లక్ష్మణానికి పెళ్ళి నిశ్చయమైంది. ప్రథమ శుభలేఖ మీ కివ్వాలని వచ్చాం" అన్నాడు శంకరం.

"శుభం, నాయనా! ఈ ముసలి దానిపై కనీసం మీరైనా ఇంత అభిమానం చూపుతున్నారు."

"ఎంత మాటమ్మా! మేము చేస్తున్న దేముంది? ఆ నాడు మీరు, బాబుగారు [illegible] ఇలా ఉండగలిగేవారమా?" లక్ష్మణరావు అన్నాడు.

"పోనీలే, నాయనా. అవన్నీ పాత కాలం సంగతులు... ఇంతకీ పెళ్ళికూతు రెవరూ?" అడిగింది కామాక్షమ్మ.

లక్ష్మణరావు చెప్పటానికి సిగ్గు పడ్డాడు.

కామాక్షమ్మ ముసి ముసిగా నవ్వి, "నీ పేరు చెప్పటానికి ఆ అమ్మాయి సిగ్గు పడాలి కాని, నీ కెందుకోయ్!" అన్నది.

లక్ష్మణరావు మాట్లాడక పోవటం చూసి శంకరం కల్పించు కున్నాడు.

"మే మిద్దరం పదిహేనేళ్ళుగా ఒక్క ప్రాణంగా - బ్రతుకుతున్నాం కదా, పిన్నిగారూ? అందుచేత మా స్నేహాన్ని బంధుత్వంగాకూడా రూపొందించాలని నిశ్చయించుకున్నాము. లక్ష్మణ్ నా చెల్లెలు సుశీలని పెళ్ళి చేసుకుంటు న్నాడు. ఇలాంటి సహృదయుడు లభించటం మా మహా అదృష్టం" అన్నాడు.

"అబ్బ! ఊరుకోరా. మన మధ్య ఇన్ని మాట లెందుకూ" అన్నాడు లక్ష్మణరావు.

"చాలా సంతోషం, నాయనా! నాకు ఈ వేళ చాలా సంతోషంగా ఉంది... అన్నట్టు పార్వతి రాలేదే? చూసి చాలా రోజులయిందికూడాను!" ఉండబట్ట లేక అడిగింది కామాక్షమ్మ.

ఈసారి సిగ్గు పడటం శంకరం వంతయింది.

"నా వాడు మిమ్మల్ని మామ్మని చెయ్యబోతున్నాడండీ. బుల్లి ఉమాకాంత రావుగారు పుట్ట బోతున్నారు. పార్వతికి నెలలు" అన్నాడు లక్ష్మణరావు.

"ఇవేళేమిటి! శుభ వార్త మీద శుభవార్తలు చెపుతున్నారు... ఉండండి, ఇప్పుడే వస్తా" నంటూ కామాక్షమ్మ వంటింట్లోకి వెళ్ళి గుప్పెడు పంచదార తెచ్చి ఇద్దరి నోళ్ళలో పోసింది.

"వచ్చే వారం పెళ్ళి, పిన్నిగారూ! అన్నవరం కొండ మీద నిరాడంబరంగా పెళ్ళి జరపాలని నిశ్చయించాము. మీరు, అన్నయ్య, వదిన, బాబు అందరూ మూడు రోజులు ముందు గానే వచ్చి మీ చేతుల మీదుగా మమ్మల్ని ఓ ఇంటి వాళ్ళని చెయ్యాలి." వినయంగా అర్థించాడు లక్ష్మణరావు.

"తప్పకుండా వస్తాం, బాబూ! ఈ ముసలి ప్రాణానికి ఇంతకంటే సంతోష కరమైన విషయం మరేముంటుంది?" అంది కామాక్షమ్మ. తరవాత నెమ్మదిగా నిట్టూర్చి, 'ఈ నాడే కనక ఆయన ఉంటేనా?' అనుకుంది.

"అది మా దురదృష్టం! బాబుగారు గనకఉంటే ఎంతగానో సంతోషించేవారు" అన్నాడు శంకరం.

కొద్ది క్షణాల పాటు కామాక్షమ్మ మౌనంగా ఉంది.

"మరి మేము సెలవు తీసుకుంటాం, పిన్నిగారూ! ఊళ్ళో చాలా మందికి శుభలేఖలు అందించాలి" అన్నాడు లక్ష్మణ రావు.

"మంచిది, నాయనా!"

ఆవిడ దగ్గర సెలవు తీసుకుని శంకరం, లక్ష్మణరావు ఇద్దరూ వెళ్ళిపోయారు. ఇద్దర్నీ సాగనంపి వీధి తలుపు వేసి లోపలికి వచ్చింది కామాక్షమ్మ. కుర్చీలో కూలబడి ఆలోచించసాగింది.

కాస్సేపటికి లేచి నిలబడి గదిలోకి నడిచి తన పెట్టె తెరిచి ఉమాకాంతం గారు ఉపయోగించిన చత్వారపు కళ్ళ జోడు అందుకుంది. [illegible] తరవాత పార్థుడు చదువుకునే గదిలోకి వెళ్ళింది. పార్థుడి పుస్తకాల సంచీ తెరిచి పెన్సిలు, నోటుపుస్తకం తీసుకుంది. ఆ పుస్తకంతో బాటు రెండు ఉత్తరాలు కింద పడ్డాయి. అవి సీత, రాజేశ్వరి ఆవిడకు వ్రాసిన ఉత్తరాలు. ఆ కవర్ల మీద స్టాంపుల కోసం వాటిని దాచుకున్నాడు పార్థుడు. కామాక్షమ్మ కూతుళ్ళ ఉత్తరాలు అందుకుని ఓ సారి వాటిని పరికించి చూసి బాధగా నిట్టూర్చింది.

తరవాత పెన్సిలు మొన జాగ్రత్తగా చెక్కింది. నేలమీద చాప పరుచుకుని గోడ కానుకుని కూర్చుని నోటు పుస్తకం తెరిచి పెన్సిలుతో ఏదో వ్రాయటానికి ఉపక్రమించింది.

'ఏమని మొదలు పెట్టాలి?' ఆలోచించ దావిడ. చివరికి "ప్రియమైన శ్రీవారికి" అన్న సంబోధన స్ఫురించింది.

ఆవిడ మస్తిష్కంలో ఎన్నో భావాలు వెలరేగసాగాయి. అన్నింటినీ ఆవిడ కాగితం మీద పెట్టడానికి ప్రయత్నించసాగింది.

"నా జీవితంలో మొట్ట మొదటి సారిగా నేను మీకు వ్రాస్తున్న ఉత్తరం ఇది. తప్పు లేమయినా ఉంటే క్షమించండి.

మనం నలభై అయిదు సంవత్సరాలు కలిసి జీవితయాత్ర సాగించాము. తరవాత మీరు ఈ బంధాలన్నీ తెంచు కుని తిరిగి రాని లోకానికి వెళ్ళిపోయారు. రెక్కలు తెగిన పక్షిలా, ముక్కాని [illegible] నావలా మిగిలాను నేను. మీరు లేని జీవితం నా పట్ల కృష్ణపక్షపు రాత్రి

వి. ఎస్. ఎన్. మూర్తి




మద్రాసులోని విల్లివాకం తెలుగు పఠన మందిరం వార్షికోత్సవం ఇటీవల డాక్టర్ సి. ముద్దుకృష్ణారెడ్డి అధ్యక్షతన వైభవంగా జరిగింది. శ్రీ త్రిపురనేని మహారథి, శ్రీ జె. వి. సోమయాజులు, సినీ నటి శ్రీమతి సూర్యకాంతం, శ్రీ జె. టి. ఆచార్యులు, శ్రీ పద్మనాభం ప్రసంగించారు. పఠన మందిరం అధ్యక్షులు శ్రీ మోహన్‌రెడ్డి చిత్రంలో ఉన్నారు. కార్యదర్శి శ్రీ వై. ఉమామహేశ్వరరావు నివేదిక సమర్పిస్తున్నారు.

అయింది. శేషజీవితం ఎలా వెళ్ళబుచ్చాలో తెలిసేది కాదు నాకు మొదట్లో. అసలు నే నెందుకు బ్రతకాలి అన్న ఆలోచన వచ్చేది

నా ఈ అంధకారమయ జీవితాన్ని మన కన్న బిడ్డలయినా కొంతవరకూ కాంతివంతం చేస్తారని ఆశ పడ్డాను. కాని, అది భ్రమ అని తెలిసింది.

మీ రెప్పుడూ చెపుతూండేవారు— 'ఈ ప్రపంచంలో ఎవరికి ఎవరూ లేరు. నాది, నా వాళ్ళు అని అనవసరంగా అభిమానాలు పెంచుకోకూడదు' అని. అది నిజం. ఈ నాడు మన కన్నబిడ్డల కంటే మన వద్ద వారాలు చేసుకుని చదువుకున్న పిల్లలు నన్ను అభిమానంతో చూసుకుంటున్నారు.

చదువే మనిషికి ఆస్తి అనే వారు మీరు. అందువల్లనే కన్నబిడ్డలకి చదువు తప్ప మరే ఆస్తీ మీ రివ్వలేదు. ఉన్న స్థిరచరాస్తులు చదువుకోలేని బీద విద్యార్థుల చదువు నిమిత్తమై వినియోగించారు. మీ దగ్గర ఎందరో చదువుకుని వృద్ధిలోకి వచ్చారు. వాళ్ళలో కొందరు అప్పుడప్పుడు నాకు కనిపిస్తుంటారు. వాళ్ళు నన్నెంతో ప్రేమాభిమానాలతో పలకరిస్తారు. తమ ఇళ్ళకి ఆహ్వానిస్తారు. పరాయి పిల్లలకి ఇంతటి వినయ విధేయతలు ప్రసాదించిన మీ చదువు మన కన్నబిడ్డలకి ఎందుకు కలిగించలేదా అని నాకు సంశయం కలుగుతూంది.

మీరు మరణశయ్యపై ఆదేశించినట్లుగానే నా ఒంటి మీద మిగిలి ఉన్న బంగారం హెడ్మాస్టరు రంగాచార్యులుగారికి ఇచ్చి బీద విద్యార్థుల చదువు నిమిత్తమై వినియోగించమన్నాను. ఆయన దానిని సద్వినియోగం చేస్తున్నారు. ఆ బంగారం నా వద్ద ఉన్నంత కాలం సీత, రాజేశ్వరి, వసంత— అందరూ నన్ను చక్కగా చూసుకున్నారు. అది లేనినాడు నేను ఎవరికీ పనికిరాని దాని నయ్యాను.

రాఘవ మనస్తత్వం మీకు తెలిసిందే కదా? నా ఉనికే వాడసలు పట్టించుకోడు. ఎంతయినా కొడుకు దగ్గర ఉండక తప్పదని ఇక్కడే పార్థుణ్ని చూసుకుంటూ జీవితం వెళ్ళబుచ్చుతున్నాను. పార్థుడు నన్నర్థం చేసుకోలేక పోయినా, నా కబుర్ల ద్వారా వాడి గుండెలో మీ మీద ఎంతో ప్రేమాభిమానాలు పెంపొందించుకున్నాడు.

నా ఈ బ్రతుకు కొనసాగటానికి వా డొక కారణం.

అప్పుడప్పుడు, కన్న కొడుకు ఇంట్లో పరాయి దానిలా బ్రతుకు తున్నాననే భావన నా గుండె రగుల్చుతూంది.

ఎన్నాళ్ళో ఈ బ్రతు కింకా?

పోనీండి. ఈ జన్మ కింతే నని ఊరుకుంటాను.

అసలు మీ కీ ఉత్తరం వ్రాయటానికి కారణం నా ఈ ఆవేదన కాదు. పరాయి పిల్లలు మన పట్ల చూపించే ఆదరాభిమానాలే మీ కీ ఉత్తరం వ్రాయటానికి నన్ను పురిగొల్పాయి.

మీరు ఏలూరులో పని చేసేటప్పుడు మన ఇంట్లో వారాలు చేసుకుంటూ, రాత్రిళ్ళు మీ వద్ద చదువుకునే కుర్రాళ్ళు శంకరం, లక్ష్మణరావు ఈ ఊళ్ళోనే ఉన్నారు. ఇద్దరూ కష్టపడి ఉద్యోగాలు చేసుకుంటూ, పెద్ద చదువులు చదివి ఈ నాడు వృద్ధి లోకి వచ్చారు.

వాళ్ళిద్దరికీ మన పట్ల అచంచలమైన విశ్వాసం ఉంది. లక్ష్మణరావుకి త్వరలో వివాహం జరగబోతూంది. నన్ను పెళ్ళి పెద్దని చేశారు. శంకరం తండ్రి కాబోతున్నాడు. అతని బిడ్డకి మీ పేరు పెట్టడానికి నిశ్చయించాడు.

ఈ సమయంలో వా రిద్దరి ఆనందం పంచుకోవటానికి మీరు లేరని ఇద్దరూ బాధ పడుతున్నారు.

నాకు తోచినదంతా ఏమిటేమిటో వ్రాసేశాను కదూ? ఏం చేయ్యను, చెప్పండి. ఈ విషయాలన్నీ నా లోనే ఉంచుకోలేకపోయాను. అందుచేతనే ఈ ఉత్తరం ద్వారా మీకు తెలియ జేస్తున్నాను.

ఈ ఉత్తరం మీకు ఎలా పంపాలి అన్నది నే నాలోచించ లేదు. ముందు ఉత్తరం వ్రాయాలి. సంగతులన్నీ మీకు చెప్పాలి. ఇదే నా లక్ష్యం. ఉత్తరం వ్రాయగలిగాను. అదే నాకు చాలు. ఉంటాను మరి.

అనేక నమస్కారములతో . . .

మీ అర్ధాంగి . . .

—కామాక్షి."


ఉత్తరం ముగించింది కామాక్షమ్మ. ఒక కవరు తీసుకుని ఉత్తరాన్ని మడిచి కవరులో పెట్టింది.

'కవరు మీద విలాసం ఏం వ్రాయాలి?' తనను తాను ప్రశ్నించుకుందావిడ.

'కీర్తిశేషులు ఉమాకాంతరావుగారు' అని వ్రాస్తే చాలేమో అనుకుంది.

ఆలోచనలో ఉన్న కామాక్షమ్మ వీధి తలుపు తట్టిన శబ్దం, పార్థుడి గొంతు విని ఉలిక్కిపడి చేతిలో ఉన్న కవరు దగ్గరలో ఉన్న అరలో ఒక పుస్తకంలో ఉంచింది.

తరవాత వెళ్ళి తలుపు తీసింది.




"ఏమిటి, మామ్మా! నిద్ర పోతున్నావా?" అడిగాడు పార్థుడు.

"లేదురా! ఏదో ఆలోచిస్తున్నా" గొణిగింది కామాక్షమ్మ.

ఆ రాత్రి ఇంటి పనులతో ... తీరిక చిక్కలేదు. ...దయమే సీత, రాజేశ్వరి తమ కుటుంబాలతో ఏదో విలాస యాత్రకు వెళుతూ అన్నగారి ఇంట్లో ఒక రోజు ఆగారు.

ఆ సాయంత్రం పిల్ల లందరూ పుస్తకాలు కిందా మీదా చెయ్యటంలో కామాక్షమ్మ వ్రాసిన ఉత్తరం కింద పడింది.

దానిని పార్థుడు చేతిలోకి తీసుకుని లోపల ఉన్న కాగితం బయటికి తీసి మడత విప్పాడు.

"ఏమిటది?" అడిగారు పిల్లలు.

"ఏమో?" అన్నాడు పార్థుడు.

ఆదే సమయానికి కామాక్షమ్మ ఆ గదిలోకి వెళ్ళటం తటస్థించింది. ఆవిడ తన ఉత్తరాన్ని గుర్తించి, వెంటనే పార్థుడి చేతిలో నుంచి లాక్కుని నలిపేసింది.

"ఏమిటి మామ్మా, అది?" అడిగాడు పార్థుడు.

"ఉత్తరం."

"నువ్వే వ్రాశావా?"

"అవును."

"ఎవరికి వ్రాశావు?"

"తాతయ్యకి."

"మరయితే అందులో కబుర్లేం వ్రాయకుండా అ... ఇ... ఉ... అ.. ఆ... ఈ... ఇ... ఎ... అని మాత్రం ఉత్తరం అంతా ఎందుకు నింపావు?"

కామాక్షమ్మ మాట్లాడలేదు.

ఉత్తరం చేతిలో ఉంచుకుని బయటికి నడిచింది. హాల్లో భర్త ఫోటో ముందు కన్నీళ్ళతో నిలబడింది.

'ఏం చెయ్యను, చెప్పండి. నాకు వ్రాయటం రాదు. కొన్ని వేల మందికి విద్యాదానం చేశారు మీరు. నాకు వ్రాయటం నేర్పించాలని మీ రెంత ప్రయత్నించినా, నేను కించిత్తయినా శ్రద్ధ చూపలేదు. పైగా—"మీ లాంటి వారి దగ్గర ఉండగా నాకు చదు వెందుకు?" అని కొట్టి పారేసేదాన్ని. ఈ నాడు చదువు విలువ నాకు తెలిసి వచ్చింది. నా వేదనని ఒకళ్ళకి చెప్పుకో లేకపోయినా, కనీసం కాగితం మీద నయినా వ్రాసుకునే అదృష్టానికి నేను నోచుకోలేదు' అనుకుంది. కామాక్షమ్మ కళ్ళ నుంచి రెండు కన్నీటి చుక్కలు జారి ఆవిడ చేతిలో ఉన్న ఉత్తరంపై పడ్డాయి. ★